తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
# ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శనివారం-03- జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 216 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# మూసీ పునరుజ్జీవంతో నగరానికి మహర్దశ

**గోదావరి జలాలతో నిరంతరంగా ప్రవాహం**

**మూసీ పరివాహకరంలో నైట్ బజార్‌ల అభివృద్ధి**

**నిర్వాసితులకు పక్కా ఇళ్లు కట్టించి ఇస్తాం**


**మూసీ పొడువునా ఎలివెటెడ్ కారిడార్ల నిర్మాణం**

**అంతర్జాతీయ కన్సల్టెంట్లతో ప్రణాళికలు**

**డిపిఆర్ సిద్ధం కాగానే ఎమ్మెల్యేలకు వివరణ**

**కొందు కావాలనే మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు**

**అసెంబ్లీలో మూసీ అభివృద్ధిపై సిఎం రేవంత్ వివరణ**



హైదరాబాద్,జనవరి 2(తెలంగాణ ముచ్చట్లు): మూసీ పునరుజ్జీవనంతో హైదారబాద్ ఖ్యాతిని మరింత పెంచడంతో పాటు, మెరుగైన నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మూసీ పొడువునా గోదావరి నీటిని పారించి సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఈ క్రమంలో నిర్వాసితులకు పునరావసం కూడా కల్పిస్తామని అన్నారు. నిజాం ఎంతో ముందుచూపుతో మూసీ పొడవునా మంచి కట్టడాలు కట్టి ఆదర్శంగా నిలిచారని అన్నారు.

2లో



## జలవివాదాల పరిష్కారానికి చొరవ

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

హైదరాబాద్,జనవరి2 (తెలంగాణ ముచ్చట్లు): జల వివాదాల పరిష్కారానికి కేందప్రభుత్వం సంపూర్ణ సహకారం అందజేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల్ర మధ్య జలవివాదాల పరిష్కారానికి ఓ కమిటీని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడిరచారు. ఆ కమిటీని కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ నోటిఫై చేసిందని తెలిపారు. కేంద్ర జల వనరుల సంఘం చైర్మన్ నేతృత్వంలో ఈ కమిటీ పని చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా తెలుగురాష్ట్రాల్ర ఇరిగేషన్ అధికారులు ఉన్నారని వివరించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు కిషన్‌రెడ్డి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్ర మధ్య నదీజలాల వినియోగంలో నెలకొన్న వివాదాల పరిష్కారానికి సంబంధించిన

2లో

## కవిత కేసీఆర్ వదిలిన బాణమే

- అందులో అనుమానం లేదన్న కోమటిరెడ్డి
- సీఎం రేవంత్ అంటే అభిమానమని వ్యాఖ్య



హైదరాబాద్,జనవరి 2(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ వదిలిన బాణం కవిత అని ఆయన అభివర్ణించారు. కవిత కన్ఫ్యూజన్‌లో ఉండి ప్రజలను కన్ఫ్యూజ్ చేస్తోందని వ్యంగ్యంగా అన్నారు. కవిత ఏ పార్టీలో ఉందో స్పష్టం చేయాలంటూ మంత్రి కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. తన తండ్రి మీద సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆమె.. హరీష్ రావు మీద చేసిన వ్యాఖ్యలపై ఎందుకు స్పందించలేదు? అంటూ కవితను ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు.

మిగతా 2లో

## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్

- గన్ పార్క్ వద్ద ధర్నా.. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు
- సభలో మాట్లాడనీయకుండా మైక్ కట్ చేస్తారా
- స్పీకర్ తీరుపై హరీష్ రావు అసహనం



హైదరాబాద్,జనవరి 2(తెలంగాణ ముచ్చట్లు): శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. సీఎం మాట్లాడిన తర్వాత సభలో మాట్లాడేందుకు, నిరసన తెలిపేందుకు అవకాశం ఇవ్వడం లేదని ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఆరోపించారు.

మిగతా 2లో



## మున్సిపల్ పరిపాలన వ్యవస్థను పటిష్టం చేసే లక్ష్యం

- జీహెచ్ఎంసీలో పౌరులకు మెరుగైన సేవలను అందిస్తాం
- పురపాలక, జీహెచ్ఎంసీ చట్టసవరణ బిల్లుపై శ్రీధర్ బాబు
- నిపుణుల సలహాతో ముందుకు వెళ్లాలన్న కూనంనేని

హైదరాబాద్,జనవరి2(తెలంగాణ ముచ్చట్లు): మున్సిపల్ పరిపాలన వ్యవస్థను పటిష్టం చేసే దిశగా ముందుకు వెళ్తున్నామని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. అసెంబ్లీలో పురపాలక, జీహెచ్ఎంసీ చట్టసవరణ బిల్లుపై చర్చలో శ్రీధర్ బాబు మాట్లాడారు.

2లో

# మాంజా పంజా.. తస్మాత్ జాగ్రత్..

**చైనా మంజా వాడితే కఠిన చర్యలు | సోదాలు చేపట్టిన సైబరాబాద్ పోలీసులు**



హైదరాబాద్,జనవరి2(తెలంగాణ ముచ్చట్లు): నైలాన్ 'చైనీస్' మాంజా, గాజు లేదా లోహంతో కోటింగ్ చేసిన పదునైన దారాల వినియోగం వల్ల రాష్ట్రంలోని ఇటీవల వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆకాశంలో ఎగిరే గాలిపటం ఆనంద హేతువైతే, అదే రోడ్డుపై పడే మాంజా దారం మృత్యవకు కారణం అవుతోంది. ఇది శోచనీయం. మనుషులు, జంతువులు, పక్షుల ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తోంది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మియాపూర్ ? చందానగర్ ప్రధాన రహదారి, మాదాపూర్, హైటెక్ సిటీ, కూకట్‌పల్లి, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో ఇటీవలి కాలం లో ద్విచక్ర వాహనదారుల మెడలకు చైనీస్ మాంజా చిక్కి తీవ్ర గాయాలపాలైన ఘటనలు కలకలం రేపాయి. బాలానగర్ రహదారిపై ట్రాఫిక్ మధ్యలో ద్విచక్ర వాహనదారుడి మెడకు దారం తగలడం వలన మెడకు తీవ్ర గాయమయ్యింది. అపార్ట్ మెంట్లు, మేడలపై నుంచి గాలిపటాలు ఎగురవేయడం కారణంగా మాంజా చెట్ల కొమ్మలకు, విద్యుత్ తీగలకు చిక్కి రోడ్డుపై వేలాడటం కారణం గా ప్రమాదాలకు దారి తీస్తోంది. చైనీస్ మాంజా నైలాన్, తయారవడంతో పాటు గాజుపొడి, లోహచూర్ణం పూత ఉండటంతో అత్యంత పదునుగా, ప్రమాదకరంగా మారుతోంది.

మిగతా 8లో

## గూడ్స్‌కి వాహనాలపై 7.5 శాతం లైఫ్ టాక్స్

- ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ స్టేషన్స్ ఏర్పాటు
- వాహనసారథిలో చేరిన తెలంగాణ రాష్ట్రం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



హైదరాబాద్,జనవరి2 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్రంలో మోటారు వాహనాల పన్ను విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. శుక్రవారం రవాణా శాఖలో తెలంగాణ మోటారు వాహనాల పన్ను సవరణ చట్టంపై శాసన సభలో చర్చ జరిగింది. ఈ చర్చలో భాగంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. 4 వీలర్ తేలికపాటి గూడ్స్ వాహనాలకు త్రైమాసిక టాక్స్ ఉండేదని ప్రస్తావించారు. రవాణా శాఖ నిపుణులతో చర్చించి గూడ్స్‌కి సంబంధించిన వాహనాలపై లైఫ్ టాక్స్ విధిస్తూ 7.5 శాతానికి అమలు చేశామని వివరించారు. ఇది కొత్తగా రిజిస్టకనేషన్ అయ్యే వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టంచేశారు.

త్వరలో ఢల్లీమాదిరిగా ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ స్టేషన్స్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. డ్రైవింగ్ స్కూల్స్‌పై కూడా ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.

మిగతా 2లో



## కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిందే

- రేవంత్ భాష తీరు దారుణం
- కెసిఆర్‌ను ఉరి తీయాలంటారా?
- అలా అయితే రేవంత్‌ను పదిసార్లు ఉరితీయాలి
- హరీష్ రావు బబుల్ షూటర్ మాత్రమే
- మీడియాతో చిట్‌చాట్‌లో కవిత సంచలన వ్యాఖ్యలు

8లో

శనివారం-03- జనవరి 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్


తెలుగు దిన పత్రిక

# మూసీ పునరుజ్జీవంతో నగరానికి మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

నిజాంలు నిర్మించిన ప్రాజెక్టులే హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని అన్నారు. గతంలో జలవనరులను కాపాడుకొనే ప్రయత్నాలు జరగలేదని విమర్శించారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. గతంలో జల వనరులను కలుషితం చేశారు. కబ్జాలతో ఫాంహౌస్‌లు నిర్మించారు. వాటి డ్రైనేజీలను జంట జలాశయాలకు కలిపారు. నిందితులపై ఉక్కు పాదం మోపాం. డ్రైనేజీలను కూలగొట్టాం. కాకతీయుల నుంచి నిజాం వరకు నదీ పరివాహకంలోనే ప్రాజెక్టులు చేపట్టారు. వరద ముంపు నుంచి నగరాన్ని రక్షించేందుకు 1922 నాటికి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ ప్రాజెక్టులు చేపట్టారు. ప్రపంచ దేశాలతో హైదరాబాద్ పోటీపడేలా నగరాన్ని నిజాంలు తీర్చిదిద్దారు. వారు చేసిన అభివృద్ధిని గత పాలకులు కనుమరుగు చేశారు. నదులను కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా మార్చారు. నగరంలోని మురుగుకాల్వలను మూసీకి కలిపారు. ఇలా కలుషితం చేయడంతో నల్గొండ జిల్లాలోని మూసీ పరివాహక ప్రజలు జీవించలేని దుర్భర పరిస్థితి నెలకొంది. ఆ పరిస్థితి నుంచి కాపాడాలని వేలాది మంది విజ్ఞప్తి చేశారని సిఎం తెలిపారు. ఈ నేపథ్యంలో మూసీ సుందరీకరణపై అధ్యయనం చేశాం. ఏడాదంతా నదిలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళికలు రూపొందించాం. మూసీ ప్రక్షాళనకు కన్‌స్టలెంట్ కోసం గ్లోబల్ టెండర్లు పిలిచాం. 3 సంస్థలు జాయింట్ వెంచర్ కింద మూసీ పునరుద్ధరణ పనులు చేపట్టాయి. గోదావరి నుంచి 20 టీఎంసీల నీరు నగరానికి తరలించాలనే ప్రణాళిక ఉందని, అందులో ప్రజల దాహార్తిని తీర్చేందుకు 15 టీఎంసీలు, గండిపేటకు మరో 5 టీఎంసీలు తరలించేలా ఆలోచిస్తున్నామని వివరించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో సుందరీకరణపై లండన్, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్‌లలో అధ్యయనం చేశాం. ప్రపంచస్థాయి నగరాల్లో నదీ పరివాహక ప్రాంతాలను కాపాడుకొని వ్యాపార కేంద్రాలుగా మార్చారు. ఆర్థికవ్యవస్థ బలోపేతానికి ఆయా దేశాలు పోటీపడుతున్నాయి. గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధి కోసం 60వేల కుటుంబాలను తరలించారు. యూపీలో గంగా నదిని ప్రక్షాళన చేసి రివర్‌ఫ్రంట్ ఏర్పాటు చేశారు. ఆ అభివృద్ధిని భాజపా ఎన్నికల అజెండాగా మార్చారు. ఆయా రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళనను వ్యతిరేకించడం లేదని రేవంత్ వివరించారు. కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని విపక్ష పార్టీలోని పలువురు కీలక నేతలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమన్నారు. తాను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ విపక్ష సభ్యులను ఆయన సూటిగా నిలదీశారు. ప్రజలకు నిజాలు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారా? అని వారిని ప్రశ్నించారు. వివరాలు చెబుతుంటే నొప్పి ఎందుకు మీకు అంటూ

విపక్ష సభ్యులపై ఆయన మండిపడ్డారు. మూసీకి అడ్డంగా పడుకుంటామంటున్న వారు..మొన్న వర్షాలు వచ్చినప్పుడు ఎక్కడికిపోయారంటూ వారిని సీఎం రేవంత్ రెడ్డి కడిగేశారు. కొంతమంది తనను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నారని.. రియల్ ఎస్టేట్ సైతం ఒక ఇండస్ట్రీనే అని ఆయన వివరించారు. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారని పేర్కొన్నారు. రోజు రోజుకు పట్టణీకరణ పెరుగుతుందని చెప్పారు. రాబోయే 20 ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగుతుందని తెలిపారు. తెలంగాణలో మూసీ నది 240 కిలోమీటర్లు ప్రవహిస్తుందన్నారు. అనంతగిరి హిల్స్ నుంచి వాడపల్లి వరకు మూసీ ప్రవాహం ఉందన్నారు. మూసీ, ఈసీ నదులు కలిసే చోటు బాపుఘాట్ నిర్మిస్తామని.. అందుకే అక్కడ గాంధీసరోవర్ ప్రాజెక్ట్ చేపట్టామని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి జరుగు తుందని పేర్కొన్నారు. మూసీ నది ప్రక్షాళనను మొదట 21 కిలోమీటర్లు చేయాలని చూస్తున్నామని.. హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి చేస్తామని చెప్పారు. మార్చిలో తొలి దశ పనులు ప్రారంభిస్తామన్నారు. సంక్రాంతిలోగా తొలి దశ డీపీఆర్‌పై క్లారిటీ ఇస్తామని పేర్కొన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 51 కి.మీ మూసీ అభివృద్ధి చేస్తామని వివరించారు. 51 కి.మీ ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామన్నారు. మీరాలం ట్యాంక్ కూడా మూసీ అభివృద్ధిలో భాగమేనని స్పష్టం చేశారు. ఈ ట్యాంక్‌పై రూ.450 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. నదులు కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా చేశారని మండిపడ్డారు. నదీ పరివాహక ప్రాంతాల నిర్వాసితులకు ప్రత్యామ్నాయం కోరామని చెప్పారు. మూసీ నది కలుషితం కారణంగా నల్లగొండ జిల్లాలో ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీటి నుంచి కాపాడాలని వేలాదిగా విజ్ఞప్తులు వచ్చాయన్నారు. ఏడాదంతా మూసీలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఆలయాలు, మసీదులు, గురుద్వారాలు, చర్చి నిర్మిస్తామని తెలిపారు. మూసీ నదిని ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే మూడు నెలల్లో అంచనాలు ఫైనల్ చేస్తామని ప్రకటించారు. ఏడీబీ బ్యాంకు రూ.4,100 కోట్ల రుణం ఇస్తుందన్నారు. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. డిపిఆర్ పూర్తయ్యాక అసెంబ్లీలో చర్చిస్తామని, సభ్యుల సూచనలు కూడా స్వీకరిస్తామని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. మీ నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి కావాలో చెప్పాలని సూచించారు. పేదలకు మంచి ఇళ్లు కట్టించి వారికి మెరుగైన వసతులు కల్పిద్దామని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. తాము మంచి పని చేయాలనుకుంటున్నాం? మీ సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. డీపీఆర్ సిద్ధమయ్యాక ఎమ్మెల్యేలందరికీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి సలహాలు తీసుకుంటామని గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



# కవిత కేసీఆర్ వదిలిన బాణమే

(మొదటి పేజీ తరువాయి)



ఇక బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. సీఎం స్పందనపై కవిత శుక్రవారం కాస్తా ఘాటుగా స్పందించారు. దీనికి కోమటిరెడ్డి ఘాటుగా స్పందించారు. తనకు సీఎం రేవంత్ రెడ్డి అంటే గౌరవమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని ఎవరు ఏమన్నా అంటే కౌంటర్ ఇస్తానన్నారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మంత్రి పదవి కోసం తాను ఏ రోజు పాకులాడలేదని చెప్పారు. మంత్రి పదవి కావాలంటూ తాను ఎవరిని అడగలేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం మంత్రి పదవినే తాను త్యాగం

చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తనకు, తన తమ్మునికి మధ్య ఎటువంటి గొడవలు లేవని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జనవరి 1వ తేదీ గురువారం సాయంత్రం ప్రజాభవన్‌లో జలాలు ` నిజాలు అంశంపై తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు. దీనికి కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు పార్టీలోని సీనియర్లు పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు వల్లే తగ్గిదంటూ సీఎం రేవంత్ కాస్తా ఘాటుగా స్పందించారు. సీఎం చేసిన వ్యాఖ్యలపై కవిత మండిపడ్డారు. కవిత వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.



# అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్

(మొదటి పేజీ తరువాయి)

సభలో ప్రభుత్వం పెట్టే బిల్లులపై చర్చకు దూరంగా ఉండాలని నిర్ణయించారు. ఎమ్మెల్యేల ప్రవేశద్వారం వద్ద వారు ఆందోళనకు దిగారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారంటూ నినాదాలు చేశారు. అనంతరం గన్‌పార్క్ వద్దకు వెళ్లి అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. సభలో సభ్యులకు సమాన హక్కులుంటాయని.. వాటిని స్పీకర్ కాపాడాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఏడు రోజుల సభ నిర్వహణపై బీఏసీలో చర్చకు రాలేదని చెప్పారు. సభలో చర్చించే అంశాలను 24 గంటల ముందు పంపాలని డిమాండ్ చేశారు. తాము అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వడం లేదని ఆక్షేపించారు. నిరసనలు తెలిపేందుకు మైక్ ఇవ్వకపోవడం.. ప్రతిపక్షం గొంతు నొక్కడమేనన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో నిరసన తెలపడం ప్రతిపక్ష సభ్యుల హక్కు అని చెప్పారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ ఏకపక్ష వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. అసెంబ్లీ నుంచి గన్‌పార్క్ వద్దకు కాలినకడన వచ్చిన ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. స్పీకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యం దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేశారు. ఇది శాసనసభనా? గాంధీ భవనా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అంతకుముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో మూసీ సుందరీకరణ అంశంపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని వ్యాఖ్యానించారు. దీనిపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఎం వ్యాఖ్యలపై చర్చించేందుకు సమయం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. కానీ అందుకు స్పీకర్ నిరాకరించడంతో బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.

# గూడ్స్‌కి వాహనాలపై 7.5 శాతం లైఫ్ టాక్స్

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ హయాంలోని పదేళ్లలో వాహన సారథిలో తెలంగాణ చేరలేదని చెప్పుకొచ్చారు. దేశంలో 29 రాష్ట్రాలు వాహన సారథిలో చేరితే తెలంగాణ మాత్రం చేరలేదని.. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రాన్ని వాహన సారథిలో చేర్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో రోడ్ సేఫ్టీపై సెస్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ,కర్ణాటక , మహారాష్ట్ర ,గుజరాత్ రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్. ద్విచక్ర వాహనాలకు రూ.2 వేలు, లైట్ మోటార్ వాహనాలకు రూ.5 వేలు , హెవీ వాహనాలకు రూ.10 వేలు రోడ్ సేఫ్టీ సెస్ ఏర్పాటు చేశామని వెల్లడిరచారు. కొత్తగా రిజిస్టర్ అయ్యే వాహనాలకు మాత్రమే రోడ్ సేఫ్టీ సెస్ విధించినట్లు వివరించారు. ఆటోలు ,ట్రాక్టర్లకు ఇది వర్తించదని స్పష్టం చేశారు. మరణాలు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలతోనే జరుగు తున్నాయని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఇటీవల ఒక ప్రకటన చేశారని ప్రస్తావించారు. జనవరి 1వ తేదీ నుంచి జనవరి 31వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడిరచారు. తాము రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తామని.. విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. ఇందుకోసం విద్యాశాఖ, సంక్షేమ శాఖ, పలు పాఠశాలలు పాల్గొనేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. రోడ్డు భద్రతాపై విద్యార్థులకు, ప్రతి పౌరుడుకి అవగాహన కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. యూనిసెఫ్ సహకారంతో పలు పాఠశాలల్లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. తెలంగాణను రోడ్డు ప్రమాదాల రహితంగా మార్చడానికి జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేశామని వెల్లడిరచారు మంత్రి పొన్నం ప్రభాకర్. రాష్ట్రంలో వెయ్యి మంది రవాణా శాఖ అధికారులు ఉంటే ..1. 80 లక్షల వాహనాలు ఉన్నాయని..ఒక్కొక్కటిగా వాహనాలు పరిశీలించడం కుదరదని చెప్పుకొచ్చారు. ఎవరికీ వారే స్వయంగా వాహనాల ఫిట్‌నెస్ చూసుకోవాలని.. రోడ్డు నిబంధనలు తప్పకుండా



పాటించాలని సూచించారు.

వికారాబాద్ బస్సు ప్రమాదంలో ఎవరో చేసిన తప్పిదానికి అమాయకులు చనిపోయారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ విద్యార్థులు, ఇతర పాఠశాలల్లోని విద్యార్థులు రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు , అధికారులు, విద్యార్థులు అందరూ రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో పాల్గొనాలని మార్గనిర్దేశం చేశారు. బ్లాక్ స్పాట్‌లను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అతి వేగాన్ని కట్టడి చేసేలా కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రోడ్ సేఫ్టీ మంత్‌పై లేఖ రాశారని ప్రస్తావించారు మంత్రి పొన్నం ప్రభాకర్. రోడ్ సేఫ్టీపై ప్రజలు, అన్ని విభాగాల అధికారులు భాగస్వామ్యం కావాలని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా చర్యలు తీసుకుంటున్నామనే విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. గూడ్స్ ఆటోలకు , తేలికపాటి వాహనాలకు మాత్రమే త్రైమాసిక టాక్స్ నుంచి లైఫ్ టాక్స్‌లోకి తీసుకుంటున్నట్లు వెల్లడిరచారు. తెలంగాణలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ఈవీ పాలసీ తీసుకొచ్చామని చెప్పుకొచ్చారు. దాదాపు రూ.1000 కోట్లు టాక్స్‌ను ప్రభుత్వం నష్టపోయిందని అన్నారు. హైదరాబాద్‌లో ఈరోజు ఎయిర్ క్వాలిటీ 300 దాటిందని తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఈవీ పాలసీ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలు పెరుగుతాయని.. దీంతో కాలుష్యాన్ని అరికడుతున్నామని చెప్పుకొచ్చారు. స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామని.. 15 ఏళ్లు దాటిన వాహనాలు ఈ స్క్రాప్ పాలసీలోకి వస్తాయని వెల్లడిరచారు.

# జలవివాదాల పరిష్కారానికి చొరవ

(మొదటి పేజీ తరువాయి)



కమిటీని శుక్రవారం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నోటీస్ చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం.. సహకార సమాఖ్య విధానంతో.. గత 11 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారానికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తోందని చెప్పుకొచ్చారు. ఇందుకోసం ప్రత్యేకమైన వేదికలను ఏర్పాటుచేసి సమన్వయంతో సమస్యల పరిష్కారానికి బాటలు వేస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కమిటీకి కేంద్ర జల వనరుల సంఘం చైర్మన్ నేతృత్వం వహించనున్నారు.



(మొదటి పేజీ తరువాయి)

# మున్సిపల్ పరిపాలన వ్యవస్థను పటిష్టం చేసే లక్ష్యం

జీహెచ్‌ఎంసీలో పౌరులకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. హైదరాబాద్‌ను మళ్లీ ఎన్ని కార్పొరేషన్లుగా విభజిస్తామో ఇంకా నిర్ణయించలేదని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే గ్రేటర్ విలీనం జరిగిందన్నారు. మూసీ విషయంలో సీఎం ఎవరి పేర్లు ప్రస్తావించలేదు. పేర్లు ప్రస్తావించనప్పుడు భారత రాష్ట్ర సమితి సభ్యులు ఎందుకు స్పందిస్తున్నారు. మూసీ విషయంలో సభ్యుల సూచనలు స్వీకరిస్తామని సీఎం చెప్పారు. గ్రేటర్‌ను ఎన్ని కార్పొరేషన్లుగా విభజించాలో అందరి అభిప్రాయాలు తీసుకుని ముందుకెళ్తాం. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించాలని ప్రాథమికంగా అనుకుంటున్నాం. ప్రస్తుతం హైదరాబాద్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 174 పాయింట్లు ఉంది. నగరంలో గాలి నాణ్యత మున్ముందు మరింత పడిపోకూడదని భావిస్తున్నాం. కాలుష్యం మరింత పెరిగిపోకూడదనే.. నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు తరలించే పక్రియ చేపట్టాం అన్నారు. హైదరాబాద్‌ను 360 డిగ్రీలు కవర్ చేసేలా.. మెట్రో విస్తరణ చేపట్టాలని నిర్ణయించాం. అనుమతులు, నిర్వహణలో సమస్యలు రావొద్దనే మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం టేకోవర్ చేస్తోంది. హైదరాబాద్‌లో మున్ముందు మొత్తం ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే తిరిగేలా చూస్తాం అని మంత్రి వెల్లడిరచారు. జీహెచ్‌ఎంసీలో వార్డుల సమస్య ఉంటే పరిష్కరిస్తాం. ఇప్పటికే 8 మంది జోనల్ కమిషనర్లను నియమించాం. హైదరాబాద్ పరిపాలన కోసం ప్రత్యేకంగా ఇద్దరు ఐఏఎస్ అధికారులను నియమించాం. గత ప్రభుత్వం సిబ్బందిని నియమించకుండానే జిల్లాలను 33కి పెంచింది. 33 కలెక్టరేట్‌లను నిర్మించింది కానీ.. వాటిలో సిబ్బంది లేరు. ఈ ప్రభుత్వం రాగానే టీజీపీఎస్సీ ద్వారా కలెక్టరేట్లలో సిబ్బందిని నియమించాం. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచింది. ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరు ఉంటే.. అది కూడా తొలగించారని శ్రీధర్ బాబు అన్నారు. మున్సిపాలిటీల విలీనంతో హైదరాబాద్.. అతిపెద్ద నగరంగా అభివృద్ధి చెందడం సంతోషంగా ఉందని సీపీఐ ఎమ్మెల్సీ కూనంనేని సాంబశివరావు అన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. వికేంద్రీకరణలో జాగ్రత్త వహించాలని, పరిపాలన సామర్థ్యాన్ని సరిచూసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రపంచ మహానగరంగా మారాలని గొప్పలకు పోతే తిప్పలు తప్పవన్నారు.

మౌలిక సమస్యలు ఎలా పరిష్కరించాలన్న దానిపై ఆలోచన చేయాలని చెప్పారు. వర్షాకాలంలో చిన్న వర్షాలకే హైదరాబాద్‌లో ట్రాఫిక్‌జామ్ అవుతుందన్నారు. జిల్లాలు మహానగరంలో విలీనం అవుతున్నాయని, ప్రపంచంలో ఉన్న సౌకర్యాలు కల్పించే అవకాశముందని చెప్పారు. దీనిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. కాలుష్య, డ్రైనేజీ, రోడ్డు వంటి అంశాలపై మేధావులతో చర్చించాలని చెప్పారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కుషాయిగూడ డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ప్రారంభం





**కుషాయిగూడ, జనవరి 02 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కుషాయిగూడ ట్రాఫిక్ ఎస్ఐ జి. మధు మాట్లాడుతూ, ప్రజా రవాణాలో ఆర్టీసీ కీలక పాత్ర పోషిస్తోందని, ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన సేవలు అందిస్తోందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు పూర్తిగా శూన్యంగా (0) మారాలని ఆకాంక్షించారు.డ్రైవింగ్ సమయంలో పూర్తి శ్రద్ధ, బాధ్యతతో వాహనం నడిపితే ప్రమాద రహిత డ్రైవర్లుగా గుర్తింపు పొందుతారని సూచించారు. బస్సులను తప్పనిసరిగా బస్‌బేలోనే నిలపాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఉల్లంఘించే ప్రయత్నాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ట్రాఫిక్ ఏఎస్ఐ నర్సింలు మాట్లాడుతూ, మనం మరియు మన కుటుంబ సభ్యులు సురక్షితంగా రోడ్లపై ప్రయాణించాలంటే ప్రతి ఒక్కరూ తమ విధులను కర్తవ్యదిక్షతో నిర్వర్తించాలని అన్నారు.డిపో మేనేజర్ మాట్లాడుతూ, మానవ తప్పిదాల వల్లే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ రక్షణాత్మక (సేఫ్) డ్రైవింగ్ పాటించాలన్నారు. డ్రైవింగ్ సమయంలో పాదాచారులు, ద్విచక్ర వాహనదారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వేగ నియంత్రణ పాటిస్తూ, మద్యపానం లేకుండా వాహనం నడపడం అత్యంత అవసరమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వేణుగోపాల్, కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నర్సింలు, ఎస్ఐ జి. మధు, అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) వ్యాసు, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు ఈ. జనార్ధన్, బి. ఎలంధర్ రెడ్డి, కండక్టర్లు, డ్రైవర్లు మరియు పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

# మోజర్ల గ్రామ అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ-ఆరోగ్య విద్యా దినోత్సవం






- చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- మోజర్ల సర్పంచ్ చంద్రశేఖర్

**పెద్దమందడి,జనవరి2(తెలంగాణ ముచ్చట్లు):** మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పెద్దమందడి మండలం మోజర్ల గ్రామంలో శుక్రవారం 1,2వ అంగన్వాడీ కేంద్రాలలో న్యూట్రిషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోజర్ల గ్రామ సర్పంచ్ కె. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి సుధారాణి హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అంగన్వాడి కేంద్రాలలో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని, సరైన పోషణతో పాటు ఆరోగ్య విద్య అందిస్తూ చిన్నారులకు ఫిజికల్ యాక్టివిటీస్, ఆటల పోటీలు నిర్వహించాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో భాగంగా అంగన్వాడి కేంద్రాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు.అనంతరం అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, వనపర్తి ప్రాజెక్ట్ సిడిపిఓ హాజీరాబేగం, ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరాణి, అంగన్వాడీ టీచర్లు శారద, సువర్ణ, ఆశా కార్యకర్తలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన టిజిఓ అసోసియేషన్ ఎంఎం డిస్ట్రిక్ట్ సభ్యులు





**మేడ్చల్–మల్కాజ్‌గిరి, జనవరి 02 (తెలంగాణ ముచ్చట్లు):** టిజిఓ అసోసియేషన్ ఎంఎం డిస్ట్రిక్ట్ ప్రతినిధులు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టిజిఓ అసోసియేషన్ ఎంఎం డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 గోడ క్యాలెండర్ మరియు టేబుల్ క్యాలెండర్‌లను అధికారికంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో టిజిఓ అసోసియేషన్ ఎంఎం డిస్ట్రిక్ట్ అధ్యక్షుడు ఎ. కురుమూర్తి, కార్యదర్శి జి. వినోద్ కుమార్, ఉపాధ్యక్షుడు డి. రవీందర్‌తో పాటు విజయ కుమారి, సాంబశివరావు, కిషన్, ఝాన్సీ, రఘునందన్ గౌడ్, జే.ఎస్. ఆర్ఎంవి. ఆనంద్ రావు, ఓఎస్ సిహెచ్. రమేష్, పి.ఎస్.ఇ. సత్యనారాయణ, శంకరయ్య, డాలీ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టిజిఓ అసోసియేషన్ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉద్యోగుల సంక్షేమం కోసం సంఘం చేస్తున్న కృషిని అభినందించారు.

# చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు

- హాసన్ పర్తి ఇన్స్పెక్టర్ చేరలు



**హాసన్ పర్తి,జనవరి 02(తెలంగాణ ముచ్చట్లు):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 66వ డివిజన్ హాసన్ పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల పర్యావరణ మిత్ర యూనిట్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారామ్ కర్ణ అధ్యక్షతన చైనా మాంజాను పూర్తిగా నిషేధించాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరణ,హసన్ పర్తి పట్టణంలోని వివిధ ప్రాంతముల లో విద్యార్థులచే పోస్టర్లు అంటించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హసన్ పర్తి పోలీస్ స్టేషన్ సిఐ చేరాలు,ఎస్సైలు దేవేందర్, గోవర్ధన్ పాల్గొన్నారు .ఈ సందర్భంగా సిఐ చేరాలు మాట్లాడుతూ నిషేధిత చైనా మాంజా సింథటిక్ నైలాందారం కలిగినది అమ్మడం కొనడం ప్రభుత్వం పూర్తిగా నిషేధించినదని అక్రమంగా అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపినారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎగురవేసే గాలిపటాలకు చైనా మాంజా దారం కట్టడం వలన పర్యావరణానికి హాని ఏర్పడటమే కాకుండా పక్షుల ప్రాణాలకు ముప్పుగా మారుతోందని వాహనదారులు,పిల్లలు కూడా ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతున్నారని కాబట్టి చైనా మాంజా దారాలను గాలిపటాలకు కట్టొద్దని ఆనందంగా జరుపుకునే పండుగను విషాదం చేసుకోవద్దని తెలిపినారు.చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలు కూడా ఈ విషయంలో సహకరించాలని ఎవరైనా అమ్మినట్లు తెలిస్తే 100,112 నెంబర్ కు కాల్ చేసి తెలుపాలని కోరా రు.పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మన పాఠశాలలో గత 30 సంవత్సరాలుగా పర్యావరణ మిత్ర యూనిట్ ఆధ్వర్యంలో అనేక పర్యావరణ హిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే సంక్రాంతి పండుగ సందర్భంగా పర్యావరణహిత రంగోలి పేపర్ కైట్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని పేపర్ కైట్స్ వినియోగించాలని ప్రాణాంతకమైన చైనా మాంజా వాడొద్దని ప్రజల్లో అవగాహన కల్పించుటకు కరపత్రములు ర్యాలీల ద్వారా చైతన్యం కలిగిస్తున్నామని తెలిపారు. పర్యావరణహిత కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన కల్పిస్తున్నామని అందుకు చెట్లను నాటడం వాటిని సంరక్షించడం ప్రకృతి పట్ల వన్యప్రాణుల,క్రిమి కీటకాదుల పట్ల ప్రేమ దయను కలిగి ఉండేలా తయారు చేస్తున్నామని తెలిపినారు.

# మనగిల్ల గ్రామంలో పోచమ్మ గుడి బాట వివాదం



- సర్పంచ్ తీరుపై గ్రామస్తుల ఆగ్రహం.. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం


**పెద్దమందడి,జనవరి2(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మనగిల్ల గ్రామ దేవత పోచమ్మ గుడికి వెళ్లే బాట విషయంలో ప్రస్తుత సర్పంచ్ దౌర్జన్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ బాధితులైన నిరుపేద కుటుంబాలు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ బాట కారణంగా తమ ప్లాట్లకు నష్టం వాటిల్లిందని, తమకు న్యాయం చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు.బాధితుల వివరాల ప్రకారం, పోచమ్మ గుడి బాట పెద్దమందడి గ్రామ శివారు మరియు మనగిల్ల గ్రామ శివారు మధ్యలో రావాల్సి ఉండగా, ప్రస్తుత సర్పంచచ్ వన్ సైడ్‌గా ప్రైవేట్‌గా కొనుగోలు చేసిన ప్లాట్లలో జేసీబీతో దౌర్జన్యంగా బాట వేయించారని ఆరోపించారు.ఎన్నికల సమయంలో తన సొంత పొలం నుంచి 20 కుంటల స్థలాన్ని బాటకు ఇస్తానని హామీ ఇచ్చిన సర్పంచ్, ఆ హామీని విస్మరించి నిరుపేద, నిరక్షరాస్యులైన కుటుంబాలపై తన అధికారాన్ని ఉపయోగించుకున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ సమస్యను పరిష్కరించేందుకు గ్రామ పెద్దలు, యువకులు, నాయకులు ముందుకు రాగా, సర్పంచ్ వాళ్ల అన్న వారిని అసభ్యకరంగా దూషించారని, మమ్మల్ని ఎవడు ఏమీ పీకలేడు అంటూ బెదిరింపులకు పాల్పడ్డారని బాధితులు కలెక్టర్‌కు వివరించారు.ఈ ఘటనను చూసి గ్రామ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, సర్పంచ్ దమనకాండను వ్యతిరేకించారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంతో పాటు, అక్రమంగా వేసిన బాటను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను వారు వినతిపత్రం ద్వారా కోరారు.

# మృతురాలు కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు రూ.10 వేల ఆర్థిక సహాయం




**పెద్దమందడి,జనవరి2(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామానికి చెందిన పిడుగు నారమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆమె కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ పార్టీ తరపున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకుడు విట్ట శ్రీనివాస్ రెడ్డి రూ.5,000/ వార్డు మెంబర్ చందు రూ.5,000/ చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.మృతురాలి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు తెలిపారు .ఈ కార్యక్రమంలో గత్ప రమేశ్వర్ రెడ్డి, పిడుగు బందేన్న, రాకేష్, చిన్నగుంట దాసు, అర్జునయ్య, దారం నరసింహ, పిడుగు పెద్ద వెంకటన్న, పి. గంగపురి, వడ్డే కురుమన్న, బురన్, ముఖేష్, వడ్డే కృష్ణ, పిడుగు అంజి తదితరులు పాల్గొన్నారు.

# అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భజన కార్యక్రమం



ముఖ్య అతిథిగా పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి

**హబ్సిగూడ, జనవరి 02 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గంలో అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో హబ్సిగూడలో ని శ్రీ మహంకాళి, శ్రీ రామ మందిరం లో శ్రీకృష్ణుని భజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగానిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, శాంతిని పెంపొందిస్తాయని అన్నారు. అగర్వాల్ సమాజ్ పెద్దలు, ప్రతినిధులతో కలిసి పరమేశ్వర్ రెడ్డి శ్రీకృష్ణునికి ప్రత్యేక భజనలు సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనల్లో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.ఈ కార్యక్రమంలో విపిన్ కుమార్ అగర్వాల్, బాబు రావు, శ్రవణ్ రెడ్డి, విజయ్ కుమార్, జావీద్, ధర్మరాజు, సాయికుమార్, రాజన్న, వరప్రసాద్, రమాకాంత్ రెడ్డి, సింగమనేని రఘు, విశాల్, వికాస్, శివ, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# నూతన సంవత్సర వేడుకల్లో కూచిపూడి నృత్యాల ప్రదర్శన

**కుషాయిగూడ, జనవరి 02(తెలంగాణ ముచ్చట్లు):** వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉప్పల్ నియోజకవర్గం కాప్రాసర్కిల్ డా. ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచాయి. సంప్రదాయ భారతీయ నృత్యకళ అయిన కూచిపూడి ద్వారా స్వామివారి లీలలు, పురాణ ఇతిహాస ఘట్టాలను ఆవిష్కరిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.నక్షత్ర నాట్య నిలయం ఆధ్వర్యంలో, అంకం శిరీష నేతృత్వంలో ఈ నృత్య కార్యక్రమం భక్తి రసంతో ఘనంగా జరిగింది.కళాకారులు తమ నైపుణ్యం, హావభావాలు, భావప్రకటనలతో స్వామివారి మహిమను చాటుతూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఆలయ



ప్రాంగణమంతా భక్తిమయ వాతావరణంతో ఉత్సవ శోభను సంతరించుకుంది.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమా ప్రకాష్ రావు, ఎమ్మెల్సీ బండ ప్రకాష్ పీఏ, ఓఎస్డీ పరమేష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి నృత్య ప్రదర్శనలను ప్రారంభించారు. అనంతరం కళాకారుల ప్రదర్శనలను తిలకించి, సంప్రదాయ నృత్య కళను ఆదరిస్తూ కళాకారులను అభినందించారు.ఈ సందర్భంగా బ్రాహ్మంజలి, పూర్వారాగం, మూషిక వాహనం, మహాభారత ఘట్టాలు, అన్నమాచార్య కీర్తనలు, దేవీ స్తుతి సరస్వతి, పిబారే రామరసం, అంబ శాంభవి వంటి నృత్యాంశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తాళ -లయ సమన్వయంతో కూడిన నృత్య కదలికలు, కళాకారుల భావప్రకటన ప్రేక్షకులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లాయి.పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై నూతన సంవత్సరాన్ని భక్తి పరవశంలో జరుపుకున్నారు. సంప్రదాయ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచిన ఈ కూచిపూడి నృత్య ప్రదర్శనలు నూతన సంవత్సర వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని భక్తులు అభిప్రాయపడ్డారు.



## పీచర గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతర టెండర్లు

**వేలేరు,జనవరి02(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో నిర్వహించనున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు సంబంధించి టెండర్ల ప్రక్రియను దేవస్థాన కమిటీ విజయవంతంగా పూర్తి చేసింది. ఈ టెండర్ల ద్వారా మొత్తం రూ.6,25,000 ఆదాయం సమకూరినట్లు కమిటీ వెల్లడించింది. జాతర నిర్వహణలో భాగంగా బెల్లం టెండర్‌ను ఏడపెల్లి నవీన్ రూ.1,00,000కు, కొబ్బరికాయల టెండర్‌ను పోలు నాగరాజు రూ.70,000కు, కోళ్ల (చికెన్) టెండర్‌ను మాతంగి రాజేష్ రూ.1,30,000కు, మద్యం టెండర్‌ను శివరాత్రి వెంకటమల్లు రూ.3,25,000కు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ గోల్లేనా రమేష్, వైస్ చైర్మన్ సట్ల రవీందర్ మాట్లాడుతూ జాతరను శాంతియుతంగా, ఘనంగా నిర్వహించేందుకు గ్రామ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, వివిధ కుల సంఘాలు సమిష్టిగా సహకరించాలని కోరారు. టెండర్లు జనవరి 10 నుండి ప్రారంభమై 45 రోజులపాటు కొనసాగుతాయని తెలిపారు. ఈ కాలవ్యవధిలో గ్రామ పరిధిలో ఎవరూ బెల్లం, కొబ్బరికాయలు, చికెన్, మద్యం విక్రయించకూడదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి విక్రయాలు చేపడితే రూ.50,000 జరిమానా విధిస్తామని, అటువంటి ఉల్లంఘనలపై సమాచారం అందించిన వారికి రూ.5,000 బహుమతి అందజేస్తామని కమిటీ వెల్లడించింది.ఈ కార్యక్రమంలో మరిజె నరసింహారావు, మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, దేవస్థాన కమిటీ డైరెక్టర్లు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని టెండర్ల ప్రక్రియను విజయవంతం చేశారు.




## జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్

**చిల్కానగర్, జనవరి 02 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఉప్పల్ జోనల్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన జోనల్ కమిషనర్ రాధిక గుప్తా ఐఏఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ గీతా బన్నాల మాట్లాడుతూ, చిల్కానగర్ డివిజన్ పరిధిలోనే ఉప్పల్ జోనల్ కార్యాలయం ఏర్పాటు కావడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. గతంలో ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం ఎల్బీనగర్ ప్రాంతంలో, సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం సికింద్రాబాద్‌లో ఉండేదని, అదే విధంగా ఉప్పల్ జోనల్ కార్యాలయం ఉప్పల్లోనే ఏర్పాటు కావడం ప్రజలకు మరింత సౌలభ్యంగా మారిందని తెలిపారు. దీని ద్వారా ప్రజాసమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్‌తో పాటు ఆకుల మహేందర్, కొండల్ రెడ్డి, మాస శేఖర్, చేర్యాల శ్రీనివాస్, రామాంజనేయులు, బీరప్ప గడ్డ బాలు, బంటి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పరమేశ్వర్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎస్.వి.కృష్ణ



**మల్లాపూర్, జనవరి 02 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డిని వారి నివాసంలో కాంగ్రెస్ నాయకుడు ఎస్.వి.కృష్ణ (కిట్టు) మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 2026 నూతన సంవత్సరం నియోజకవర్గ ప్రజలకు శుభాలు కలగాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ ఐదవ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఫిరోజ్ ఖాన్, అన్వర్, రామ్ ప్రసాద్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి కలుపుతో కాగితం తయారీ

- ఐఐటీ ధార్వాడ్ విద్యార్థుల 'వెస్ట్ టు వెల్త్' వినూత్న ప్రయోగం



**ఉప్పల్ , జనవరి 02 (తెలంగాణ ముచ్చట్లు):** కర్ణాటక రాష్ట్రంలోని ఐఐటీ ధార్వాడ్‌లో చదువుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు రేపక భర్గవి, సుధీర్‌లు పర్యావరణ పరిరక్షణ దిశగా వినూత్న పరిశోధన చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ లో నిర్వహించిన నెలరోజుల ఇంటర్న్‌షిప్‌లో భాగంగా నీటి కలుపు (వాటర్ హైసింత్) నుంచి కాగితం తయారీపై 'వెస్ట్ టు వెల్త్' ప్రాజెక్ట్‌ను విజయవంతంగా పూర్తి చేశారు.ఈ పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డా. శ్రీను నాయక్, ప్రొఫెసర్ ఎస్. ఇలయ్య మార్గదర్శకత్వం అందించారు. సాధారణంగా చెరువులు, కాలువల్లో విపరీతంగా పెరిగి పర్యావరణ కాలుష్యానికి కారణమయ్యే నీటి కలుపును వినియోగించి కాగితం తయారు చేయడం ద్వారా కాలుష్య నియంత్రణ తో పాటు సహజ వనరుల సంరక్షణ సాధ్యమవుతుందని విద్యార్థులు వివరించారు.ఈ ప్రాజెక్ట్ విద్యార్థుల పరిశోధనా ప్రతిభకు నిదర్శనంగా నిలిచిందని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తు లో ఈ విధానాన్ని పరిశ్రమల స్థాయిలో అమలు చేసే అవకాశాలు ఉన్నాయని, ఇది పర్యావరణ హిత పరిశ్రమలకు దోహదపడుతుందని వారు తెలిపారు.

## మృతుడికి నివాళులు అర్పించిన బీఆర్ఎస్ నాయకుడు కురుసపెల్లి రమేష్



**ధర్మసాగర్,జనవరి02(తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని జానకిపురం గ్రామానికి చెందిన మండల ఆగయ్య యాదవ్ మృతి చెందడంతో, ధర్మసాగర్ మండల బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు కురుసపెల్లి రమేష్ వారి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కురుసపెల్లి రమేశ్ గ్రామశాఖ ఉపాధ్యక్షుడు,కురుసపెల్లి రఘు, గ్రామశాఖ కార్యదర్శి కురుసపెల్లి మల్లయ్య (మాజీ వార్డు సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు), సుక్కసాంబరాజు నాలుగో వార్డు సభ్యుడు తదితరులు పాల్గొని మృతుడికి నివాళులు అర్పించారు.


## బండి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన దయ్యాల దాసు



**వనపర్తి,జనవరి02(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్, కంటెస్టెంట్ ఎమ్మెల్యే బండి రమేష్‌ను కార్మిక విభాగం రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ దయ్యాల దాసు శుక్రవారం హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా దయ్యాల దాసుతోపాటు అంబేద్కర్ కాలనీ బస్తీ అధ్యక్షులు గద్దల ప్రభాకర్ మంజుల శంకరయ్య అంబేద్కర్ నగర్ రోడ్ నెంబర్ నైన్ అధ్యక్షులు చెవుల విజయ రావు పాల్గొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ భేటీలో పార్టీ బలోపేతం, రాబోయే రాజకీయ కార్యాచరణపై చర్చ జరగగా, కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని బండి రమేష్ నాయకులకు సూచించారు.

## కుషాయిగూడ పరిసర కాలనీలకు బస్ సౌకర్యం కల్పించాలి



- డిపో అధికారికి వినతి పత్రం సమర్పించిన కాలనీ ప్రతినిధులు

**కుషాయిగూడ, జనవరి 02 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ పరిసర ప్రాంతాల్లోని పలు కాలనీల వాసులకు తక్షణమే బస్ సౌకర్యం కల్పించాలని కోరుతూ కుషాయిగూడ బస్ డిపో ఓఎస్ నర్సింహా రెడ్డికి గురువారం వినతి పత్రం సమర్పించారు.శుభోదయ కాలనీ ఫేస్-1,2,3, సోనియా గాంధీ నగర్ కాలనీ ఫేస్-1,2,3, వాసవి శివనగర్ కాలనీ, మీనాక్షి నగర్, న్యూ వాసవి శివనగర్, ఎంఆర్ఆర్ కాలనీ, ద్వారకాపురి కాలనీ, మధురనగర్, మోడీ కాలనీ, గణేష్ నగర్ కాలనీ, వైష్ణవి ఎన్‌క్లేవ్, మరితి ఎన్‌క్లేవ్, లక్ష్మీ నర్సింహా కాలనీల వాసులు బస్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ, బస్ సౌకర్యం లేక విద్యార్థులు, మహిళలు, ఉద్యోగస్తులు, వృద్ధులు నిత్యం రెండు కిలోమీటర్లు నడిచి కుషాయిగూడ బస్ స్టాప్‌కు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా వెంటనే 3కే, 117, 17 నంబర్ల బస్సులను ఆయా కాలనీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.దీనికి స్పందించిన డిపో ఓఎస్ నర్సింహా రెడ్డి ఈ విషయాన్ని డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి, ప్రజల సౌకర్యార్థం త్వరలోనే బస్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ నాలచెరువు జనార్దన్, మీనాక్షి నగర్ కాలనీ అధ్యక్షులు సురేష్ గుప్త, నర్సింగ్ రావు, శుభోదయ కాలనీ మాజీ అధ్యక్షులు కాసుల నందం గౌడ్, లక్ష్మీ నర్సింహా కాలనీ ప్రతినిధి ఎస్. సత్యం యాదవ్, నీరుడు బాబు, ఎన్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి,జనవరి2(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించారు.నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్నందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

# తెలంగాణ గడ్డపై సబ్బండ వర్గాల రాజ్యాధికారమే లక్ష్యం



- **టీఆర్‌పీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యువజన అధ్యక్షుడు సింగం అరుణ్ కుమార్ పటేల్**

**మేడ్చల్–మల్కాజిగిరి, జనవరి 02 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ గడ్డపై సబ్బండ వర్గాల రాజ్యాధికారాన్ని సాధించడమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) నిరంతరం పనిచేస్తోందని పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న అన్నారు. ఆయన ఆదేశాల మేరకు టీఆర్‌పీ యువజన విభాగంలో రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాలకు యూత్ అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలను నియమించినట్లు పార్టీ వర్గాలు గురువారం వెల్లడించాయి.ఈ క్రమంలో టీఆర్‌పీ యువజన విభాగం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా సింగం అరుణ్ కుమార్ పటేల్ ను నియమించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, తెలంగాణ భవిష్యత్తును మార్చే శక్తి యువతేనని స్పష్టం చేశారు. పదవి అనేది అధికారం కాదని, ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావించాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలు, సబ్బండ వర్గాల రాజ్యాధికార లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.

అనంతరం నూతన జిల్లా యువజన అధ్యక్షుడు సింగం అరుణ్ కుమార్ పటేల్ మాట్లాడుతూ, ఈ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్నకు, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి గౌడ్‌కు, రాష్ట్ర యువజన అధ్యక్షుడు చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. యువతను సంఘటితం చేస్తూ పేదలు, నిరుద్యోగులు, అణగారిన వర్గాల సమస్యలపై ఉద్యమాత్మకంగా పోరాడతామని స్పష్టం చేశారు. మల్లన్న అడుగుజాడల్లో నడుచుకుంటూ గడప గడపకు పార్టీ సందేశాన్ని తీసుకెళ్లి, తెలంగాణలో ప్రజారాజ్య స్థాపన కోసం యువతను ముందుండి నడిపిస్తామని తెలిపారు.

# రిషిత జ్ఞాపకార్థంగా ఇంటి నిర్మాణానికి రూ 10 వేల రూపాయలు చేయూత



**ఖమ్మం బ్యూరో,జనవరి 02 (తెలంగాణ ముచ్చట్లు):** కూసుమంచి మండల కేంద్రంలో నివాసం ఉంటున్న దామళ్ళ గోపినాథ్ తండ్రి వెంకన్న ఇటీవల సొంత ఇంటి కల కోసం నిర్మాణం చేపట్టారు. వారికి చేయూతనివ్వాలని దామళ్ళ రాజకుమార్ తండ్రి సీతారాములు (బండి) తన కుమార్తె ఐన దామళ్ళ రిషిత జ్ఞాపకార్థంగా ఇంటి నిర్మాణం కొరకు దామళ్ళ పాపారావు (టీచర్ ) ఆధ్వర్యంలో శుక్రవారం గోపినాథ్ కుటుంబానికి రూ 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.





# 45 ఏళ్ల తర్వాత మణిగిల్ల గ్రామంలో ఘనంగా కూరగాయల సంత ప్రారంభం

గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్

**పెద్దమందడిజనవరి2(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మణిగిల్ల నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మణిగిల్ల గ్రామంలో శుక్రవారం సాయంత్రం వివేకానంద చౌరస్తా వద్ద కూరగాయల సంతను ఘనంగా ఏర్పాటు చేశారు. గత 45 సంవత్సరాల తర్వాత గ్రామంలో తొలిసారిగా కూరగాయల సంత ఏర్పాటు కావడం విశేషంగా నిలిచింది. గ్రామ ప్రజలకు నిత్యావసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, గ్రామంలోనే కూరగాయలు అందుబాటులో ఉండేలా తీసుకున్న ఈ నిర్ణయంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ గొప్ప నిర్ణయం తీసుకున్న నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్‌కు గ్రామ పెద్దలు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ అభివృద్ధి దిశగా నూతన సర్పంచ్ తీసుకుంటున్న చర్యలు ఆదర్శంగా నిలుస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్‌తో పాటు ఉపసర్పంచ్ ముప్పూరు గణేష్, ఎస్. రాములు, పోతుల రామిరెడ్డి, గొంది వెంకటరామరెడ్డి, శ్రీనివాసులు సాగర్, ముప్పిరి చెన్నయ్య, అనిల్ కుమార్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, కొములయ్య, వెంకటయ్య, తిరుపతయ్య, బాలరాజు, బోయిని కృష్ణ, బండి సాయికుమార్, ముప్పూరి సాయికుమార్, కావలి శివకుమార్, మల్లికార్జున్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.





# మా ఉద్యమంలో సమాజం కలిసి రావాలి..

- **టి. సంతోష్ చక్రవర్తి, జిల్లా అధ్యక్షులు, టిడబ్ల్యూజేఎఫ్**
- **జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి బర్త్ డే సందర్భంగా అన్నం సేవ ఫౌండేషన్ లో పండ్లు పంపిణీ.**

**ఖమ్మం బ్యూరో,జనవరి 2(తెలంగాణ ముచ్చట్లు):** అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టుల ఇండ్ల సాధన లక్ష్యంగా సమాజం జర్నలిస్టులకు తోడుగా కలిసి రావాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్- హెచ్ 2843) ఖమ్మం జిల్లా అధ్యక్షులు టి. సంతోష్ చక్రవర్తి పిలుపు నిచ్చారు. శుక్రవారం టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మం నగరంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి, అన్నం సేవా ఫౌండేషన్ లో అనాధ, అభాగ్యులకు పండ్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సంతోష్ చక్రవర్తి మాట్లాడుతూ సమాజం జర్నలిస్టులకు తోడుగా నిలబడవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేవలం సానుభూతిగా మాత్రమే కాదని, అది సమాజ స్వీయరక్షణ కోసం అని అన్నారు. ప్రజాస్వామ్యంలో సత్యాన్ని వెలికి తీయడం, అన్యాయాన్ని ప్రశ్నించడం, పాలకులకు బాధ్యతను గుర్తుచేయడమే జర్నలిస్టుల ప్రధాన కర్తవ్యమని సంతోష్ చక్రవర్తి ఉద్ఘాటించారు.

అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులు ఉండటానికి గూడు లేక, అద్దె ఇళ్ళలో సతమతమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ భవిష్యత్తుపై అనిశ్చితితో బతికితే సమాజానికి న్యాయం చేసే శక్తి క్రమంగా బలహీన మవుతుందన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పోరాటం వ్యక్తిగత అంశం కోసం సాగుతున్న ఉద్యమం కాదని, సమాజానికి నిజమైన స్వరం నిరంతరం కొనసాగేందుకు సాగే న్యాయపోరాటమని సంతోష్ చక్రవర్తి పేర్కొన్నారు. అందుకే ఈ పోరాటానికి సమాజం మొత్తం మద్దతుగా నిలబడి తమ ఉద్యమానికి సంఘీభావం ప్రకటించాలని ఆయన కోరారు. ప్రజలకు-ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరించే జర్నలిస్టుల చిరకాల కోరిక నివాసయోగ్యమైన ఇంటి స్థలం మాత్రమేనని, ఆ హక్కు సాధించే వరకు వెనుకడుగు ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలో అర్హులైన 325కి పైగా జర్నలిస్టు కుటుంబాలకు గూడు దక్కే వరకూ ప్రభుత్వాన్ని నిత్యం ప్రశ్నిస్తూ, రాజీలేని న్యాయపోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఇండ్ల స్టలాల సాధనకోసం కార్యాచరణ ప్రారంభిస్తున్నట్లు సంతోష్ చక్రవర్తి తెలిపారు.

జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ పేరుతో కేటాయించిన 23.02 ఎకరాల భూమిని ఎలాంటి స్వార్థం, పక్షపాతం లేకుండా జర్నలిస్టులకు అప్పగించాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన 325 మందికి పైగా జర్నలిస్టులకు హామీ, జీవో మేరకు 200 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించడం ప్రభుత్వ బాధ్యతేనని స్పష్టం చేశారు. ఇది వ్యక్తిగత స్వార్థం కోసం చేసే పోరాటం కాదని, జర్నలిస్టు కుటుంబాల భవిష్యత్తు కోసం సాగే సమిష్టి న్యాయ ఉద్యమమని ఆయన పునరుద్ఘాటించారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు, మేధావులు, ప్రజల మద్దతుతో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. కొంతమంది దూరంగా ఉన్నా, అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టు నిస్సంకోచంగా ఈ న్యాయపోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల ఐక్యతే మా బలమని, న్యాయపోరాటమే తన లక్ష్యమని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్, ఉపాధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, లీగల్ అడ్వైజర్ పసుపులేటి శ్రీనివాసరావు, అమరబోయిన ఉపేందర్, కాసోజు శ్రీధర్, సుధాగాని కరుణాకర్, కప్పల మధు గౌడ్, కందరబోయిన నాగకృష్ణ, వంగపుంగమ గౌడ్, కొండల్, ఎలుగోటి వెంకట్, కరాటే వేణు, నాయిని స్వాతి, రాంబాబు, తుమ్మలపల్లి శ్రీనివాస్, షేక్ సోందుమియా, మల్లెల శిల్ప, కుంభం రవికుమార్, రమేష్, గంటేల కుమార్, మందాడపు మనోహర్, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.







# ప్రైవేట్ స్కూల్ బస్సు ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి

- **డ్రైవర్ మద్యం మత్తే ప్రమాదానికి కారణం.**
- **స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.**
- **టీపిటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొరకొప్పు రామారావు.**

**సత్తుపల్లి, జనవరి 2 (తెలంగాణ ముచ్చట్లు):**ఖమ్మం జిల్లా, వేంసూర్ మండలం, మద్దులగూడెం గ్రామానికి చెందిన శ్రీ వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రయాణిస్తున్న స్కూల్ బస్సు గణేష్‌పాడు - సోబ్బాయిగూడెం గ్రామాల మధ్య ప్రమాదానికి గురికావడం తీవ్ర ఆందోళన కలిగించిందని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం (టీపిటీఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొరకొప్పు రామారావు అన్నారు. ఈ ప్రమాదానికి బస్సు డ్రైవర్ మద్యం సేవించి, నిర్లక్ష్యంగా వాహనం నడపడమే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని తెలిసినా, అటువంటి డ్రైవర్లతో స్కూల్ పిల్లల బస్సులను నడిపించడమే మరింత నేరమని వ్యాఖ్యానించారు. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఆర్టీఏ నిబంధనలను ఉల్లంఘిస్తూ బస్సులను నడుపుతున్నాయని, డ్రైవర్ అర్హతలు, వాహన భద్రత, వైద్య పరీక్షలు వంటి అంశాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి నిర్లక్ష్యమే విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారుతోందని తెలిపారు.


ప్రమాద సమయంలో బస్సులో సుమారు 60 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రమాద తీవ్రత మరింతగా ఉంటే భారీ ప్రాణ నష్టం జరిగేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బస్సు ప్రమాదానికి కారణమైన ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై మరియు నిర్లక్ష్యంగా వాహనం నడిపిన డ్రైవర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, గాయపడిన విద్యార్థులకు తక్షణమే మెరుగైన వైద్య సహాయం అందించాలని కోరారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# అధికారులను మర్యాద పూర్వముకగా కలిసిన వంగాలపల్లి సర్పంచ్,ఉపసర్పంచ్





**చిల్పూర్,జనవరి02(తెలంగాణ ముచ్చట్లు):** చిల్పూర్ మండలంలోని వంగాలపల్లి గ్రామ సర్పంచ్ భూక్య మేనక సుధాకర్ నాయక్, ఉపసర్పంచ్ ఆరూరి రవిచందర్ మండల ఎమ్మార్వో విజయ్ కుమార్, సీఐ శ్రీనివాస్, ఆర్డీవో వెంకన్న, ఏసీపీ భీష్మ శర్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన చర్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తు క్రాంతి కుమార్, అరూరి దాసు, మట్యాడ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేటలో అమానుష ఘటన.!

- మద్యం మత్తులో కన్నకూతురిపై కత్తితో దాడి.





**దమ్మపేట, జనవరి 2 (తెలంగాణ ముచ్చట్లు-):** దమ్మపేట మండలంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో గొడవపడుతున్న తల్లిదండ్రులను వారించిన కన్నకూతురిపైనే కత్తితో దాడి చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.

దమ్మపేట మండలం కొత్తూరు కాలనీకి చెందిన కుంజా దుర్గారావు, అతని భార్య నిత్యం మద్యం సేవించి పరస్పరం గొడవ పడుతుంటారని స్థానికులు తెలిపారు. గురువారం రాత్రి కూడా ఇదే విధంగా మద్యం మత్తులో గొడవపడుతుండగా, వారి కూతురు కుంజా తిరుపతమ్మ (దుర్గ) గొడవ చేయొద్దని వారించింది. ఈ క్రమంలో ఆగ్రహానికి లోనైన తల్లిదండ్రులు కత్తితో తిరుపతమ్మపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన తిరుపతమ్మను శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. 108 అంబులెన్స్ ద్వారా బాధితురాలిని దమ్మపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్ మణిదీప్, నర్సింగ్ అధికారి కవిత ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో కుంజా తిరుపతమ్మ తీవ్ర గాయాలు పాలయ్యారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.





# టీజీఎస్పీ నుంచి ఏఆర్‌కు వెళ్తున్న కానిస్టేబుల్స్‌కు ఘన వీడ్కోలు

**సత్తుపల్లి, జనవరి 2 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) బి గంగారం గ్రామంలో 15వ బెటాలియన్‌కు చెందిన 2012 బ్యాచ్ కానిస్టేబుల్స్‌లో పది మంది, పదేళ్ల సర్వీసును విజయవంతంగా పూర్తి చేసుకుని కన్వర్షన్ ప్రక్రియలో భాగంగా జిల్లా ఆర్మ్ రిజర్వ్ పోలీస్ (ఏఆర్) విభాగానికి బదిలీ అవుతున్న సందర్భంగా ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ ఎన్. పెద్దబాబు కానిస్టేబుల్స్‌ను సన్మానించి, సాదరంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీజీఎస్పీ విభాగంలో విధులు నిర్వహించిన కాలంలో వారు చూపిన క్రమశిక్షణ, అంకితభావం అభినందనీయమని ప్రశంసించారు. ఏఆర్ విభాగంలోనూ అదే నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే కుటుంబ సభ్యులు, పిల్లలతో సుఖసంతోషాలతో జీవిస్తూ, విధి బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించి వృత్తిపరంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్ అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్. శ్రీధర్ రాజా, వేణుగోపాల్ రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వై. రామ సత్యనారాయణ, పి. ఉదయ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని ఏఆర్‌కు వెళ్తున్న కానిస్టేబుల్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# హృతిక్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య





**చిల్పూర్,జనవరి02(తెలంగాణ ముచ్చట్లు):** చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన హృతిక్ రెడ్డి కుటుంబాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య పరామర్శించారు. ఇటీవల జర్మనీ దేశంలో జరిగిన దుర్ఘటనలో హృతిక్ రెడ్డి మృతి పట్ల ఎంపీ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ, హృతిక్ రెడ్డి మరణం అత్యంత బాధాకరమని అన్నారు. విషయం తెలిసిన వెంటనే 31వ తేదీ నుంచి జర్మనీలోని భారత రాయబార కార్యాలయం, అక్కడి అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ చీఫ్ ఇంజనీర్ జగదీశ్వర్ రెడ్డి



**పెద్దమందడి,జనవరి2(తెలంగాణ ముచ్చట్లు):** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ చీఫ్ ఇంజనీర్ బి. జగదీశ్వర్ రెడ్డి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామానికి చెందిన బి. జగదీశ్వర్ రెడ్డి, ఈ సందర్భంగా రాష్ట్రం అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజా సంక్షేమ పాలనతో సీఎం రేవంత్ రెడ్డి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాష్ట్ర అభివృద్ధిలో అనుభవజ్ఞులైన అధికారుల సేవలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు విజయవంతం కావాలని జగదీశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు.

# డీజీపీ శివధర్ రెడ్డిని కలిసిన రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి



**వనపర్తి,జనవరి2(తెలంగాణ ముచ్చట్లు):** నూతన సంవత్సరం-2026 సందర్భంగా రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి డీజీపీ శివధర్ రెడ్డి ని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.డీజీపీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి భద్రతలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని చిన్నారెడ్డి ప్రశంసించారు.రానున్న కాలంలోనూ ఇదే స్ఫూర్తితో ప్రజల భద్రతకు పోలీస్ శాఖ కట్టుబడి ఉండాలని ఆకాంక్షించారు. డీజీపీ శివధర్ రెడ్డి కూడా స్పందిస్తూ, రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల సహకారంతో మరింత సమర్థంగా విధులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# నకిలీ తుపాకీతో జ్యువెలరీ షాపులో దోపిడీ యత్నం





**నాగారం, జనవరి 02 (తెలంగాణ ముచ్చట్లు):** కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో కీసర మండలం నాగారంలోని సత్యనారాయణ కాలనీలో ఉన్న బాలాజీ జ్యువెలర్స్‌లో శుక్రవారం సాయంత్రం దోపిడీ యత్నం చోటుచేసుకుంది. నకిలీ తుపాకీతో షాపులోకి ప్రవేశించిన దుండగులు, షాప్ యజమానిని బెదిరిస్తూ బంగారు ఆభరణాలు అప్పగించాలని డిమాండ్ చేశారు. అయితే యజమాని అప్రమత్తంగా వ్యవహరించి ధైర్యంగా ప్రతిఘటించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దాంతో దుండగులు ఎలాంటి ఆభరణాలు దోచుకోకుండా అక్కడి నుంచి పరారయ్యారు. ఘటన సమయంలో షాపులో ఉన్న కస్టమర్లు భయాందోళనకు గురయ్యారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన చేపట్టారు. అక్కడ లభించిన నకిలీ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. షాపులో అమర్చిన సీసీ కెమెరాల్లో దుండగుల కదలికలు నమోదవడంతో, వాటి ఆధారంగా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# ప్యారడైజ్ నుంచి జడల్ జమానా లుక్ విడుదల

'దసరా' విజయం తర్వాత కథానాయకుడు నాని.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'ది ప్యారడైజ్'. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మోహన్‌బాబు ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి కొత్త ఏడాది సందర్భంగా ఓ కొత్త లుక్‌ను విడుదల చేశారు. 'జడల్ జమానా' అంటూ వచ్చిన ఆ ప్రచార చిత్రంలో నాని యాక్షన్ లుక్‌లో ఆకట్టుకునేలా కనిపించారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమా మార్చి 26న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

# విశ్వక్ సేన్ కొత్త మూవీ లెగసీ

టాలీవుడ్ యంగ్ అండ్ డైనమిక్ హీరో, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరో విలక్షణమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'లెగసీ'. ప్యూర్ పొలిటికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. పాలిటిక్స్ ఈజ్ పర్సనల్ అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. టీజర్ ప్రారంభం నుండి ముగింపు వరకు చాలా ఇంటెన్స్‌గా సాగింది. ముఖ్యంగా విశ్వక్ సేన్ చెప్పిన డైలాగులు పొలిటికల్ హీట్‌ను పెంచుతున్నాయి: రాజకీయమంటే పులిమీద సవారీ లాంటిదంటారు.. ఆ పులి మీద నాయకుడు ఒక్కడే కూర్చోవాలా? ఆ కుటుంబం మొత్తం కూర్చోవాలా?దిస్ ఈజ్ యాన్ ఇంటర్నల్ వార్ ఫర్ రియల్ లెగసీ ఈ డైలాగ్స్ చూస్తుంటే, అధికారం కోసం ఒకే కుటుంబంలో జరిగే అంతర్గత పోరు, వారసత్వ రాజకీయాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని స్పష్టమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా విశ్వక్ సేన్ ఈ సినిమాలో ఒక సీరియస్ పొలిటీషియన్ పాత్రలో కనిపిస్తుండటం విశేషం. ఈ చిత్రానికి సాయికిరణ్ రెడ్డి దైడా దర్శకత్వం వహిస్తున్నారు. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ సినిమాలో ఏక్తా రాథోడ్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రావు రమేశ్, సచిన్ ఖేడ్కర్, మురళీ మోహన్, కేకే మేనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కలాహి మీడియా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమటి, సాయికిరణ్ రెడ్డి దైడా నిర్మిస్తున్నారు.



# ది కేరళ స్టోరీ`2కు ప్లాన్

ఎన్నో వివాదాలు, విమర్శల మధ్య విడుదలై బాక్సాఫీసు వద్ద మంచి వసూళ్లను సొంతం చేసుకుంది 'ది కేరళ స్టోరీ' చిత్రం. అదా శర్మ కథానాయికగా నటించింది. కేరళలో కొన్నేళ్లుగా మహిళలు అదృశ్యమైనట్లు వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వారి ఆచూకీ ఎక్కడనే ఇతివృత్తంతో సుదీప్తో సేన్ దీన్ని తెరకెక్కించారు. పలు పురస్కారాలను సొంతం చేసుకున్న ఈ చిత్రానికి ఇప్పుడు సీక్వెల్‌గా 'ది కేరళ స్టోరీ 2' రాబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చిత్రీకరణ కూడా పూర్తయినట్లు సమాచారం. ఈ సీక్వెల్ మరింత భయంకరమైన చీకటి కథను ప్రదర్శిస్తుంది. నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా చిత్రీకరణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కఠినమైన భద్రతను పాటించారు. ఈ కొనసాగింపు చిత్రాన్ని ఫిబ్రవరి 27న థియేటర్లలోకి తీసుకురావాలని విడుదల తేదీని కూడా ఖరారు చేశారు. త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.






# టైగర్ ష్రాఫ్‌తో జతకట్టనున్న కృతిశెట్టి

అందాల తార కృతి శెట్టి.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనుందా? అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. హిందీ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్‌తో దర్శకుడు మిలాప్ జవేరి ఓ చిత్రం కోసం చేతులు కలిపినట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఇందులో కథానాయికగా కృతి శెట్టిని ఎంపిక చేసిందట చిత్ర బృందం. 'ప్రముఖ నిర్మాణ సంస్థ టీ 'సిరీస్ దీన్ని భారీ బ్జడెట్‌తో రూపొందించాలని నిర్ణయించుకుంది. జనవరిలో ముంబయిలో చిత్రీకరణ ప్రారంభం కానున్న ఈ సినిమాలో టైగర్ సరసన నటించడానికి కృతి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇదే ఆమెకు తొలి హిందీ చిత్రం కావడం విశేషం. యాక్షన్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయ'ని కృతి సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', 'వా వాతియార్' విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.



# కొత్త సినిమా కోసం స్టైలిష్‌గా పవన్

కొన్నేళ్ల కిందటే ఖరారైన పవన్ కల్యాణ్ ` సురేందర్ రెడ్డి కలయికలో సినిమాని పట్టాలెక్కించేందుకు రంగం సిద్ధమైంది. నిర్మాత రామ్ తాళ్లూరి కొత్త ఏడాది ప్రారంభం సందర్భంగా ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడిరచారు. ఇదివరకు ఒప్పకున్న సినిమాల్ని ఒకొక్కటిగా పూర్తి చేసుకుంటూ వస్తున్నారు పవన్‌కల్యాణ్. ప్రస్తుతం ఆయన చేతిలో ఉన్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఈ ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక తదుపరి ఆయన చేయనున్నది... సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించనున్న సినిమానే అని స్పష్టమైంది. తన కలల ప్రాజెక్ట్ ఇదని, పవన్‌కల్యాణ్ పేరు పెట్టిన తమ నిర్మాణ సంస్థ జైత్రరామ మూవీస్‌పై ఈ చిత్రం రూపొందుతుందని తెలిపారు రామ్ తాళ్లూరి. వక్కంతం వంశీ రచనలో ఈ చిత్రం రూపొందనుంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు సాగుతున్నట్టు తెలుస్తోంది. కొత్త ఏడాదిని పురస్కరించుకుని 'ఉస్తాద్ భగత్‌సింగ్' కొత్త లుక్‌ని విడుదల చేసింది ఆ చిత్రబృందం. అందులో పవన్‌కల్యాణ్ ఒక చేత్తో టేప్ రికార్డర్, మరో చేత్తో గన్ పట్టుకుని స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. హరీశ్‌శంకర్ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రమిది.



# మనశంకరవరప్రసాద్ ట్రైలర్ 4న విడుదల

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' ట్రైలర్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమా ట్రైలర్‌ను జనవరి 4న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# సంయుక్త మీనన్ ..ది బ్లాక్ గోల్డ్

ది బ్లాక్ గోల్డ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనుంది సంయుక్తా మేనన్. ఇది ఆమె చేస్తున్న తొలి నాయికా ప్రాధాన్య చిత్రం. యోగేశ్ కేఎంసీ తెరకెక్కిస్తున్నారు. రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. మురళీ శర్మ, రావు రమేశ్, నాజర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ విషయాన్ని కొత్త ఏడాది సందర్భంగా గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. 'ఊహించని మలుపులతో సాగే సరికొత్త కథతో.. అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో ఈ సినిమా అందర్నీ అలరించేలా ఉండనుంది. సంయుక్త దీంట్లో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే 75శాతం చిత్రీకరణ పూర్తయింది. మరో 15రోజుల చిత్రీకరణెళి మిగిలి ఉంది. నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సామ్ సీఎస్, ఛాయాగ్రహణం: ఎ వసంత్.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# మాంజా పంజా.. తస్మాత్ జాగ్రత్..

(మొదటి పేజీ తరువాయి)

ఈ మాంజా ఒక్కసారిగా వేగంగా మెడకు చుట్టుకుంటే తీవ్ర రక్తస్రావం జరిగి ప్రాణాపాయం ఏర్పడే ప్రమాదం ఉంది. మానవులకే కాదు, పక్షులు, ఇతర మూగజీవలకూ ఈ మాంజా వల్ల తీవ్రంగా నష్టపోతున్నాయి. పిచ్చుకలు, కాకులు, గద్దలు, రెక్కలకు దారాలు చిక్కి ఎగరలేక మృతి చెందుతున్న ఘటనలు నమోదవుతున్నాయి. వీధి కుక్కలు, పశువుల కాళ్లకు దారాలు చుట్టుకుని గాయాలవుతున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రజల భద్రత దృష్ట్యా మాంజా అమ్మినా, వినియోగించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సైరాబాద్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. సైబరాబాద్ లో ఈ సంవత్సరం చైనీస్ మాంజా విక్రయదారులపై 53 కేసులు నమోదయ్యాయి. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు తనలిఖీలు చేపట్టారు. చైనీస్ మంజా అమ్మకాలపై నిషేదం ఉందని, అమ్మితే కఠినచర్యలు తప్పవవని సైబరాబాద్ పోలీసుల సూచనలు చేశారు. చైనీస్ మాంజా, నైలాన్, గాజు లేదా మెటల్ కోటింగ్ ఉన్న చైనీస్ మాంజాను అమ్మవద్దు, కొనవద్దన్నరు. చైనీస్ మాంజా విక్రయం, నిల్వ, రవాణా చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ఇంటి పైకప్పులు, టెర్రస్ లపై గాలిపటాలు ఎగరవేసేటప్పుడు అదనపు జాగ్రత్తలు తప్పనిసరి. గోడ అంచులు లేని



డాబా పై నుంచి కింద పడే ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పిల్లలు గాలిపటాలు ఎగరవేసే సమయంలో ప్రమాదాలు జరగకుండా తల్లిదండ్రులు లేదా పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షించాలి. రోడ్లు, ప్రధాన రహదారులు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో గాలిపటాలు ఎగరవేయ కూడదు.విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లు, సెల్ టవర్ల సమీపంలో గాలిపటాలు ఎగరవేయడం ప్రమాదకరం. విస్తృతమైన బహిరంగ ప్రదేశాలు, మైదానాలను మాత్రమే గాలిపటాలు ఎగురవేయడానికి అనువైనవి. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. తద్వారా ప్రమాదలను కొంతవరకు నివారించవచ్చు. రోడ్డుపై వేలాడుతున్న గాలిపటాల దారాలు కనిపిస్తే వెంటనే జీహెచ్ఎమ్ సీ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

తెగిపోయిన గాలిపటాల దారాలను రోడ్లు, చెట్లపై కనిపిస్తే సురక్షితంగా సేకరించి జాగ్రత్తగా డిస్పోజ్ చేయాలి. చెట్లపై లేదా విద్యుత్ తీగలపై చిక్కుకున్న దారాలను స్వయంగా తొలగించే ప్రయత్నం చేయకూడదు.వాహనదారులు గాలిపటాల సీజన్‌లో మితవేగంతో ప్రయాణించాలి.చిన్న పిల్లలను రోడ్లపై లేదా జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో గాలిపటాలు ఎగరవేయడానికి అనుమతించకూడదు.

చైనీస్ మాంజా విక్రయిస్తున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. చట్టవిరుద్ధంగా చైనీస్ మాంజా వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

# పాలు - అరటిపండు కలిపి తింటే ఏమవుతుంది?

పాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి..అరటిపండు ఎంతో శక్తినిస్తుంది..కానీ ఈ రెండింటినీ కలిపి తీసుకోవడం మంచిదేనా..? చాలా మంది కలిపి తింటుంటారు. కానీ ఇది హానికరం అని ఆయుర్వేద నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు ఈ సూపర్ ఫుడ్ కాంబినేషన్ మీ జీర్ణవ్యవస్థను ఎలా దెబ్బతీస్తుంది? మనలో చాలా మందికి భోజనం తర్వాత అరటిపండు తినే అలవాటు ఉంటుంది. మరి కొందరైతే బరువు పెరగడానికనో లేదా రుచి కోసమో బనానా మిల్క్‌షేక్‌లను ఇష్టంగా తాగుతుంటారు. పాలలో కాల్షియం, ప్రోటీన్ ఉంటే.. అరటిపండులో పొటాషియం, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. విడివిడిగా ఇవి ఎంతో మేలు చేసినప్పటికీ, వీటిని కలిపి తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదేనా? ఆయుర్వేదం దీనిపై ఏమంటోంది? ఆయుర్వేదం ప్రకారం.. మనం తినే ఆహారాల మధ్య సమతుల్యత ఉండాలి. పాలు బరువైనవి, చల్లదనాన్ని ఇచ్చేవి. అరటిపండు తేలికగా అనిపించినా, జీర్ణం కావడానికి పట్టే సమయం పాలతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. ఈ రెండింటి జీర్ణక్రియ రేటు వేర్వేరుగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థపై ఒత్తిడి పెరుగుతుంది. పాలు, అరటిపండు కలిపి తీసుకున్నప్పుడు అవి కడుపులో పూర్తిగా జీర్ణం కాక కిణ్వ పక్రియ



కు గురవుతాయి. దీనివల్ల..కడుపులో ఆమ్లత్వం పెరిగి అసిడిటీకి దారితీస్తుంది. అసంపూర్ణ జీర్ణక్రియ వల్ల శరీరంలో విషపూరిత పదార్థాలు పేరుకుపోయే ప్రమాదం ఉంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, మలజీర్తి వంటి సమస్యలు తలెత్తుతాయి. ఆయుర్వేద నిపుణుల అభిప్రాయం ప్రకారం.. పాలు, అరటిపండు రెండూ శరీరంలో కఫం పెంచే స్వభావం కలవి. వీటిని కలిపి తీసుకోవడం వల్ల సైనస్ వాపు, జలుబు, శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులు పెరిగే అవకాశం ఉంది. శరీరంలో పేరుకుపోయిన ఈ ఆమ్లత్వం చర్మంపై కూడా ప్రభావం చూపి చర్మ వ్యాధులకు దారితీయవచ్చు. మీ జీర్ణవ్యవస్థ చాలా బలంగా ఉంటే ఈ రెండింటిని కలిపి తీసుకోవడం వల్ల తక్షణమే పెద్ద సమస్యలు రాకపోవచ్చు. కానీ తరచుగా ఇలా తీసుకోవడం దీర్ఘకాలంలో అనారోగ్యానికి దారితీస్తుంది. బరువు పెరగాలనుకునే వారు లేదా మిల్క్‌షేక్ ఇష్టపడే వారు వీటిని కలిపి తీసుకునేటప్పుడు కొద్దిగా యాలకులు లేదా శొంఠి పొడిని చేర్చుకోవడం వల్ల దోషాలు తగ్గుతాయని కొందరు సూచిస్తుంటారు. అరటిపండు తిన్న తర్వాత కనీసం 20 నుండి 30 నిమిషాల గ్యాప్ ఇచ్చి పాలు తాగడం ఉత్తమమైన పద్ధతి. రుచి కంటే ఆరోగ్యం ముఖ్యం అని గుర్తించండి.

# ఒత్తిడిని చిత్తు చేసే సూపర్ మంత్రం

మానసిక, శారీరక ఆరోగ్యానికి ధ్యానం ద్వారా ఎన్నో ప్రయోజనాలు కలిగిస్తుందని సైకాలజిస్టులు చెబుతున్నారు. ఒక నిర్దిష్ట సమయం, నిర్దిష్ట ప్రశాంత ప్రదేశంలో చేస్తే ఇంకా మంచిది. ప్రాణాయామం సంబంధిత గురువుల నుంచి సూచనలు తీసుకుని చేస్తే మంచి ఫలితాలుంటాయి. ధ్యానం భావోద్వేగ ఆరోగ్యాన్ని, స్పష్టమైన మనసుకు కారణమవుతుంది. ఇది సృజనాత్మక మనస్తత్వాన్ని సృష్టిస్తుంది. అనేక ఆరోగ్య, మానసిక సమస్యలకు మన పూర్వీకులైన రుషులు అద్భుతమైన పరిష్కారాలను అందించారు. అందులో ఒకటి ధ్యానం. ధ్యానంలో అనేక రకాలున్నాయి. ఇవన్నీ శరీర, మానసికంగా అనేక ప్రయోజనాలు కలిగిస్తాయి. మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు ధ్యానం అద్భుతమైన మార్గమని చెప్పవచ్చు. ఈ ధ్యాన పక్రియలో మీరు ప్రస్తుత క్షణంలో లేదా ప్రస్తుత రోజు ఏమీ ఆలోచిస్తున్నారో, అనుభూతి చెందుతున్నారో, అనుభవిస్తున్నారో దాని గురించి ధ్యానం చేస్తాం. ఇది మీ ఆలోచనలపై నియంత్రణను ఇవ్వడంతోపాటు శ్వాస, శరీరాన్ని ఉన్నత స్థితికి తీసుకొస్తుంది. ఇక, అతింద్రీయ ధ్యానంలో మనస్సు ఒక శబ్ధం లేదా మంత్రంపై దృష్టి పెట్టడం ద్వారా లోతైన విశ్రాంతి స్థితిలోకి ప్రవేశిస్తుంది. ఓం లేదా ఇతర మంత్రోచ్ఛారణలతో ఇలా చేయవచ్చు. దీంతో మానసిక ప్రశాంతతతోపాటు అనేక ప్రయోజనాలున్నాయి. ఈ ధ్యాన్ని మహిర్షి మహేశ్ యోగి బోధించారు. ఈ ధ్యానం ద్వారా మనం ప్రపంచంలోని ప్రతీ దానిని ప్రేమించడం ప్రారంభిస్తాం. ఇది మీ కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితుల నుంచి విస్తరిస్తుంది. దీంతో ఆ ప్రపంచం మిమ్మల్ని కూడా ప్రేమించడం ప్రారంభిస్తుంది. తల నుంచి కాలి వరకు శరీర భాగాలను సునిశితంగా పరిశీలించడం కూడా ఒక రకమైన ధ్యానమే. ఇవి కూడా మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. ప్రతిరోజూ ధ్యానం చేయడం వల్ల ఆందోళన, నిరాశ తగ్గుతుందని సైకాలజిస్టులు చెబుతున్నారు.

ధ్యానం భావోద్వేగ ఆరోగ్యాన్ని, స్పష్టమైన మనసుకు కారణమవుతుంది. ఇది సృజనాత్మక మనస్తత్వాన్ని సృష్టిస్తుంది. ధ్యానం



సంతోషకరమైన జీవితాన్ని గడిపేందుకు మీకు సహాయపడుతుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. ధ్యానం ద్వారా శ్రద్ధ, ఏకాగ్రత పెరుగుతుందని అంటున్నారు. ధ్యానం మెదడు నిర్మాణంలో సానుకూల మార్పులకు కారణమవుతుందని పరిశోధకుడు జెఫ్ వారెన్ వెల్లడించారు. ధ్యానం స్వీయ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తుంది. ధ్యానం చేయడం వల్ల అధిక రక్తపోటును కూడా తగ్గించుకోవచ్చు. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ 2013 నుంచి నిర్వహించిన వివిధ అధ్యయనాలు ఇదే విషయాన్ని తేల్చాయి. క్రమం తప్పకుండా ధ్యానం చేసేవారు వివిధ అనారోగ్య, మానసిక సమస్యల నుంచి బయటపడవచ్చని చెబుతున్నాయి.

# కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిందే

హైదరాబాద్,జనవరి 2(తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయంగా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అలాగే పాలమూరు ` రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టిన కేసీఆర్‌ను ఉరి తీయాంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కవిత తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ మీద సీఎం భాష సరికాదన్నారు. కేసీఆర్‌ను ఒకసారి ఉరితీయాలంటే రేవంత్ రెడ్డిని పదిసార్లు ఉరి తీయాలంటూ మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో కవిత మాట్లాడుతూ.. ఈ సమావేశాలకు కేసీఆర్ వచ్చి సమాధానాలు చెప్పకపోతే బీఆర్ఎస్ పని ఖతం అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తప్పు చేయకపోతే సభకు రావాల్సిందే అని పట్టుబట్టారు. సభకు రాకుండా పిల్ల



కాకుల మీద సభా సమయాన్ని వదలొద్దంటూ హితవుపలికారు. ఈ విషయంలో ఒక కూతురుగా తన రక్తం ఉడుకుతోందన్నారు. ఉద్యమకారుడిని ఉరితీయాలని అంటే రక్తం మరుగుతోందని చెప్పారు. శాసన మండలి వద్ద మీడియాతో ఆమె చిట్ చాట్ నిర్వహించారు. నా రాజీనామా ఆమోదం కోరేందుకు మండలికి వచ్చాను. కేసీఆర్‌పై రేవంత్ వ్యాఖ్యలు సరికాదు. కృష్ణా జలాలపై అసెంబ్లీలో కేసీఆర్ మాట్లాడి నోరు మూయించాలి. బీఆర్ఎస్ మనుగడ కొనసాగాలంటే ఆయన అసెంబ్లీకి రావాలి. నదీ జలాల అంశాన్ని పిల్లకాకుల మీద వదిలేయవద్దు. బీఆర్ఎస్‌లో బబుల్ షూటర్లకే డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవులు ఇచ్చారని కవిత వ్యాఖ్యానించారు. సొంత జిల్లా మహబూబ్ నగర్‌కు రేవంత్ తెచ్చిన ప్రాజెక్టులు ఎన్ని అని ప్రశ్నించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావును ఉద్దేశించి కవిత మరోసారి తీవ్రమైన ఆరోపణలు చేశారు. హరీష్‌రావు ఒక బచ్చా అని అన్నారు. ఆయనకు ప్యాకేజీలు తీసుకోవడం తప్ప ఏం తెలుసు అంటూ హరీష్‌ను టార్గెట్ చేస్తూ కవిత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారింది. కేసీఆర్ సభకు రాకపోతే హరీష్ రావే అన్నీ చూసుకోవడం సరికాదని..కేసీఆర్ సభకు వచ్చి సమాధానం చెప్పాలని కవిత వ్యాఖ్యలు చేశారు.

# మూసీ ప్రణాళికలను స్పష్టం చేయాలి

- పేదలకు అన్యాయం జరగకుండా చూడాలి
- అసెంబ్లీలో ఎఐఎం సభ్యుడు అక్బరుద్దీన్

హైదరాబాద్,జనవరి2(తెలంగాణ ముచ్చట్లు):

మూసీ ప్రక్షాళనతో నిరుపేదల బతుకులు చితికిపోవద్దని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. అసలు మూసీ ప్రక్షాళన ఎక్కడి నుంచి ఎక్కడి వరకు చేస్తారని ప్రశ్నించారు. వికారాబాద్ నుంచి గండిపేట వరకు ప్లాన్స్ ఏంటో చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మూసీ ప్రక్షాళనపై జరిగిన చర్చలో అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన వికారాబాద్ నుంచి చేస్తారా? మధ్యలో నుంచి చేస్తారా అని ప్రశ్నించారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ క్యాచ్‌మెంట్ ఏరియా ఎంత ఉందని అడిగారు. ప్రపంచంలో కాలుష్యంలో మూసీ 8వ స్థానంలో ఉందని తెలిపారు.మూసీ ? ఈసా నదులు




కావు.. అవి ఇప్పుడు సీవరేజ్ ప్లాంట్లు అని అక్బరుద్దీన్ విమర్శించారు. నగరంలోని మురుగు అంతా మూసీ నదిలోకే వెళ్తోందని తెలిపారు. గండిపేట జలాశయంలో కూడా మురుగు నీరు కలుస్తుందని అన్నారు. దశాబ్దాల కింద నిర్మించిన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లో పూడిక తీసి, వాటి సామర్థ్యం పెంచాలని కోరారు. నీటి నిల్వ సామర్థ్యం పెంచితే గోదావరి జలాలను తరలించవచ్చని తెలిపారు. చార్మినార్ వద్ద మూడేళ్ల కిందట మొదలుపెట్టిన పెడస్ట్రేరియన్ ప్రాజెక్టు ఏమైందని ప్రశ్నించారు.

# టూవీలర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ప్రమాదంలో దంపతుల దుర్మరణం

హైదరాబాద్,జనవరి 2(తెలంగాణ ముచ్చట్లు):

ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వాహేద్ నగర్‌లో చోటు చేసుకుంది. సూర్యాపేట జిల్లాకు చెందిన తిరుపతిరావు, వెంకటమ్మ దంపతులు ఇటీవల దిల్‌సుఖ్‌నగర్ కొత్తపేటలో నివసిస్తున్న తమ కుమార్తె వద్దకు వచ్చారు. గురువారం సాయంత్రం ట్యాంక్ బండ్ చూసేందుకు వారు బైక్‌పై బయలుదేరారు. మూసారాంబాగ్ హైటెక్స్ మోటర్స్ సమీపంలో..వెనుక నుంచి వేగంగా వచ్చిన దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ ఆర్డినెరీ బస్సు.. వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దంపతులు రోడ్డుపై పడిపోయారు. వారిపై నుంచి బస్సు వెనుక టైర్ వెళ్లడంతో తిరుపతిరావు, వెంకటమ్మ దంపతులు అక్కడికక్కడే మరణించారు. ఈ ప్రమా




దంపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అనంతరం మృతదేహాలను స్వాధీనం చేసుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే కొత్తపేటలోని మృతుల కుమార్తెకు సైతం ఈ సమాచారం అందించారు.

# సీఎం రేవంత్ తీరు దారుణం

- కసబ్‌లాగా ఉరితీయాలని అంటారా
- మండిపడ్డ ఎమ్మెల్యే సంజయ్

హైదరాబాద్,జనవరి 2(తెలంగాణ ముచ్చట్లు):

అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మండిపడ్డారు. నదీజలాలపై పీపీటీలో పాయింట్ లేదని విమర్శించారు. అందులో అధికార బలం, అహంకారం తప్ప ఏమీ లేదని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి తీరుపై విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి బైపోలార్ డిజార్డర్‌తో బాధపడుతున్నాడని ఎమ్మెల్యే సంజయ్ విమర్శించారు. ఒక్కటే ప్రెస్‌మీట్‌లో ఒకసారి అసెంబ్లీకి రావాలి అంటాడు, వెంటనే ఉరి తీయాలి అంటాడని మండిపడ్డారు. అసెంబ్లీకి వస్తే గౌరవం ఇస్తానని అంటున్నాడు.. అంటే రేవంత్ రెడ్డి ఇప్పటివరకు అగౌరవంగానే ప్రవర్తించాడని అర్థం కదా అని ప్రశ్నించారు. కసబ్ లెక్క ఎవరిని ఉరితీస్తారో ప్రజలే నిర్ణయిస్తారని తెలిపారు. రేవంత్ రెడ్డి మూర్ఖపు మాటలకు ప్రజలు ఈసారి ఆయనను కసబ్ లాగా ఉరి తీస్తారని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకులకు గౌరవం ఉంటుందని అన్నారు. అసెంబ్లీ రూల్స్ మొత్తం ఈయనే రూల్ చేసినట్లు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. పాలమూరు బిడ్డగా పాలమూరును కాపాడుకునే అవకాశం వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డికి తెలిపారు. ఇప్పటికైనా ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేసీఆర్ వచ్చి సలహాలు ఇవ్వాలని రేవంత్ రెడ్డి అంటున్నాడని.. మరి జూరాల ప్రాజెక్టు కింద క్రాప్ హాలీడే ప్రకటించింది మీ ప్రభుత్వమే కదా అని ప్రశ్నించారు. కేఎల్ఐలో ఇప్పటికీ పుష్కలంగా నీళ్లు ఉన్నాయని తెలిపారు. కానీ ఆదిత్యనాథ్ దాస్ సలహాతో జూరాల నుంచి లిఫ్ట్ చేయాలని అంటున్నాడని పేర్కొన్నారు. దయచేసి ఇప్పటికైనా మంచి సలహాదారుడిని పెట్టుకోవాలని సూచించారు. ఆంధ్రా అడ్వైజర్‌ను తీసేసి తెలంగాణ అడ్వైజర్‌ను పెట్టుకోవాలని అన్నారు. నీళ్లకు సంబంధించి పక్క రాష్ట్రంతో మనకు ఉన్న సమస్యలు పరిష్కారం కావాలంటే తెలంగాణ సోయి ఉన్నోడు అడ్వైజర్‌గా ఉండాలని స్పష్టం చేశారు.

నికర జలాలు ఉండగా, వరద జలాల నుంచి లిఫ్ట్ ఎలా చేస్తారని ఎమ్మెల్యే సంజయ్ ప్రశ్నించారు. ఇప్పటికే ఒక మోటార్ ద్వారా వాటర్ లిఫ్ట్ చేశామని గుర్తుచేశారు. ఇవాళ, రేపు పాలమూరు ? రంగారెడ్డి ప్రాజెక్టుపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఇరిగేషన్ గురించి అర్థం కావడం లేదని ఎమ్మెల్యే సంజయ్ ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా బాగా ప్రిపేర్ అయ్యి సభకు రావాలని సూచించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in